ఎమ్మెల్సీ గద్దెపై గాదె

ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో శ్రీనివాసులునాయుడు విజయం

అభ్యర్థి	మొదటి ప్రాధాన్య ఓట్లు
గాదె శ్రీనివాసులునాయుడుకు	7,210
పాకలపాటి రఘువర్మకు	6,845
కోరెడ్ల విజయగౌరి	5,804

- ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపు
- ముగ్గురి మధ్య హోరాహోరీ
- తొలి రౌండ్ నుంచి స్వల్ప మెజారిటీతో కొనసాగిన గాదె
- తాజా విజయంతో మూడోసారి మండలిలోకి...



ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన అనంతరం ధ్రువీకరణ పత్రం చూపుతున్న గాదె శ్రీనివాసులునాయుడు



విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): **ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు తొలి రౌండ్ నుంచి ఉత్కంఠభరితంగా సాగింది. చివరకు ద్వితీయ ప్రాధాన్య ఓట్లతో గాదె తన సమీప ప్రత్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మపై గెలుపొందారు. పది మంది అభ్యర్థులు పోటీలో ఉన్నప్పటికీ కౌంటింగ్ ప్రారంభమైనప్పటి నుంచి ముగిసేంత వరకు ముగ్గురి మధ్యే ప్రధాన పోటీ నెలకొంది.**

గత నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా, ఓట్ల లెక్కింపు సోమవారం ఉదయం ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఇంజనీరింగ్ కళాశాల (ఈఈఈ భవనం)లో చేపట్టారు. ఆరు జిల్లాల పరిధిలోని 123 బ్యాలెట్ బాక్సుల్లోని ఓట్లను లెక్కించేందుకు 20 టేబుళ్లను ఏర్పాటుచేశారు. ఉదయం 8 గంటలకు స్ట్రాంగ్ రూమ్ తెరిచి అభ్యర్థుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను కౌంటింగ్ హాల్‌కు తీసుకువచ్చారు. బాక్సుల్లోని బ్యాలెట్ పత్రాలను బయటకు తీసి 25 చొప్పున కట్టలు కట్టి డ్రమ్ముల్లో వేశారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేసరికి 11 గంటలు అయ్యింది. ఆ తరువాత ఒక్కో టేబుల్‌కు వేయి చొప్పున సర్దుబాటు చేశారు. వీటిని ఏజెంట్ల సమక్షంలో ఆయా టేబుళ్లకు

... మిగతా 6వ పేజీలో

మూడోసారి ఎమ్మెల్సీ

గాదె శ్రీనివాసులునాయుడు ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడం ఇది మూడోసారి. విజయనగరం జిల్లాకు చెందిన గాదె అదే ప్రాంతంలో ఉపాధ్యాయుడుగా పనిచేసేవారు. 2007లో శాసన మండలిని పునరుద్ధరించిన తరువాత ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికను నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పోటీ చేసిన శ్రీనివాసులు నాయుడు తొలిసారి విజయం సాధించి శాసనమండలిలో అడుగుపెట్టారు. ఆ తరువాత 2013లో మరోసారి పోటీ చేసి విజయం సాధించిన ఆయన... 2019లో జరిగిన ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో మరోసారి పోటీ చేసి విజయం సాధించారు. మొత్తంగా నాలుగుసార్లు పోటీ చేసిన ఆయన మూడుసార్లు ఎమ్మెల్సీగా విజయం సాధించారు.

ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ముచేయను

- ఎమ్మెల్సీ విజేత గాదె శ్రీనివాసులునాయుడు



ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ నుంచి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న శ్రీనివాసులునాయుడు

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తనపై ఉపాధ్యాయులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయబోనని గాదె శ్రీనివాసులునాయుడు ప్రకటించారు. సోమవారం రాత్రి పదకొండు గంటలకు రిటర్నింగ్ అధికారి నుంచి ధ్రువీకరణ పత్రం అందుకున్న ఆయన కౌంటింగ్ కేంద్రం బయట విలేకరులతో మాట్లాడారు. ఈ గెలుపులో భాగస్వామ్యమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తనకు ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని ప్రకటించారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తానని పేర్కొన్నారు. మొదటిగా 2007లో ఎమ్మెల్సీగా ఎన్నికయ్యానని, అప్పటి నుంచి టీచర్ల పక్షాన పనిచేశానని, అదే అభిమానంలో 2013లో మరోసారి గెలిపించారన్నారు.



నక్కపల్లిలో విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ ప్రాంతం

అభివృద్ధి దిశగా జిల్లా

అన్ని రంగాల్లో వేగంగా వృద్ధి

- గత ఏడాది కంటే 12.94 శాతం జీఎస్‌డీపీ పెరుగుదల
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15.86 శాతం వృద్ధి
- పారిశ్రామికంగా పరుగులు
- నక్కపల్లిలో బల్క్‌డ్రగ్ పార్కు, ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అడుగులు
- మెరుగుపడిన గ్రామీణ, పట్టణ రహదారులు
- అనకాపల్లి-పాయకరావుపేట హైవే ఆరు లేన్లుగా విస్తరణకు చర్యలు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సుమారు మూడేళ్ల క్రితం ఆవిర్భవించిన అనకాపల్లి జిల్లా ఉత్పాదక ఆర్థిక వ్యవస్థ క్రమంగా బలపడుతున్నది. వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరున్న అనకాపల్లి జిల్లాలోని అచ్యుతాపురం, పరవాడ, నక్కపల్లి ప్రాంతాల్లో పారిశ్రామికరంగ వృద్ధి ఆశాజనకంగా ఉంది.

ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన 2024-25 సోషియో ఎకనమిక్ సర్వే నివేదిక అంచనాల ప్రకారం వస్తు సేవల ఉత్పత్తి జీఎస్‌డీపీ విషయంలో గతంలో పోల్చిచూస్తే అనకాపల్లి జిల్లా అనేక రంగాల్లో వృద్ధి సాధించింది. జిల్లా భౌగోళిక, సామాజిక, ఆర్థిక స్థితిగతులను పరిశీలిస్తే 2024-25 సంవత్సరానికి జిల్లాలోని మొత్తం రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) ప్రస్తుత ధరల వద్ద రూ.16.6 లక్షల కోట్లుగా (అంచనాగా) పేర్కొన్నారు. ఇది గత ఏడాదితో పోల్చితే 12.94 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఆర్థిక, సామాజిక సర్వే అంచనాల ప్రకారం భవిష్యత్తులో అనకాపల్లి జిల్లా పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశాలు మెండుగా ఉన్నాయని సర్వే గణాంకాలు చెబుతున్నాయి. ప్రధానంగా వ్యవసాయ ఆధారిత జిల్లాగా పేరున్న అనకాపల్లి జిల్లా వ్యవసాయ, అనుబంధ రంగాల్లో 15.86 శాతం వృద్ధి నమోదు చేసింది. మత్స్య, పాడి పరిశ్రమలు వృద్ధి కనబర్చగా మత్స్య పరిశ్రమలో 16 శాతం వృద్ధి నమోదైంది. అనకాపల్లి బెల్లం, ఏటికొప్పాక బొమ్మల ఎగుమతి, కొబ్బరి పీచు తయారీ వంటి చిన్నతరహా ఉత్పత్తి రంగాల వృద్ధి పెరిగింది. జిల్లాలో సేవల రంగం వృద్ధి ఆశాజనకంగా నమోదైంది. గత ఏడాదితో పోల్చితే టెలీకమ్యూనికేషన్లు 15.28 శాతం, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ 14.61 శాతం వృద్ధి సాధించాయి.

పారిశ్రామిక పరుగులు....

గత ఏడాదితో పోల్చిస్తే జిల్లాలో పారిశ్రామిక రంగం వృద్ధి 6.71 శాతం సాధించింది. ఉత్పత్తి, ఉత్పాదక రంగాల వృద్ధి 6.57 శాతంగా నమోదైంది. నిర్మాణ రంగం వృద్ధి 10.47 శాతంగా వుంది. జిల్లాలో అచ్యుతాపురం, పరవాడ సెజ్‌లలో ఇప్పటికే అనేక మెడికల్, ఫార్మా పరిశ్రమలు ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. భవిష్యత్తులో మరికొన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు

... మిగతా 6వ పేజీలో

ఏటికొప్పాక కళాకారులు సమస్యల ఏకరువు

- లక్కబొమ్మల కాలనీని సందర్శించిన కలెక్టర్ విజయకృష్ణన్
- నైపుణ్య శిక్షణ కల్పిస్తానని భరోసా



ఏటికొప్పాకలో హస్తకళాకారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

ఎలమంచిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హస్తకళలకు ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్కబొమ్మల కాలనీని సోమవారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సందర్శించారు. ఈ సందర్భంగా బొమ్మల తయారీని పరిశీలించారు. పలువురు హస్తకళాకారుల ఇళ్లకు వెళ్లి లక్కబొమ్మల తయారీకి వినియోగించే ముడి సరకులు, ఉపయోగించే రంగుల గురించి అడిగారు. ఈ సందర్భంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. ప్రధాన ముడిసరకు అయిన అంకుడు కర్ర కొరతగా వుందని, అంకుడు చెట్లసాగును పెంచి అటవీ శాఖ ద్వారా అంకుడు కర్రను అందించాలని జాతీయ అవార్డు గ్రహీతలు ఎస్.చిన్నయాచారి, గొర్స సంతోశ్ కోరారు. బ్యాంకుల నుంచి రుణసదుపాయం కల్పించాలని, నైపుణ్య శిక్షణ అందించాలని కళాకారులు విన్నవించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏటికొప్పాక లక్కబొమ్మల స్టాల్ ఏర్పాటు చేయనుండడం అభినందనీయమన్నారు. అంతర్జాతీయంగా పోటీని ఎదుర్కొనేలా కొత్త డిజైన్‌ల రూపకల్పనకు అవసరమైన శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేయిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, తహసీల్దారు వరహాలు, ఇతర అధికారులు వున్నారు.

టీచర్ల సీనియారిటీ జాబితా విడుదల

అనకాపల్లి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని రకాల ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించామని డీఈవో జి.అప్పారావునాయుడు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు తమ కార్యాలయం నోటీసు బోర్డులో వుంచామని, అలాగే హెచ్‌టీటీపీఎస్:/సైట్స్.గూగుల్.కామ్/సైట్/డీఈఓవైజాగ్12 వెబ్‌సైట్‌లో కూడా పొందుపరిచామన్నారు. ఈ జాబితాపై ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోగా డీఈవో కార్యాలయంలో లిఖితపూర్వంగా అందించాలన్నారు. జాబితాలో తప్పిదం ఎక్కడ ఉందో స్పష్టంగా పేర్కొన్నాలని, ఆధారాలు లేదా సాక్ష్యాలు జత చేయాలన్నారు.

వాట్సాప్ ద్వారా పదో తరగతి హాల్‌టికెట్లు

అనకాపల్లి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మరికొద్ది రోజుల్లో ప్రారంభం అయ్యే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టిక్కెట్లను సంబంధిత పాఠశాల లాగిన్‌లో సోమవారం మధ్యాహ్నం అప్‌లోడ్ చేసినట్టు డీఈవో అప్పారావునాయుడు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్‌లను వాట్సాప్ (మన మిత్ర) ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. దీని గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూముల్లో దర్జాగా రోడ్ల నిర్మాణం

చోద్యం చూస్తున్న ఇరిగేషన్, అటవీ శాఖల అధికారులు

శేషుగెడ్డ రిజర్వాయర్ రోడ్డును బాగు చేసుకుంటామని అనుమతి తీసుకున్న నీటి సంఘం ప్రతినిధులు

- గ్రావెల్‌తోపాటు మెటల్ రోడ్డు నిర్మాణం
- అక్కడి నుంచి అటవీ భూముల్లోకి చొరబాటు
- వాహనాలు వెళ్లేలా కాలిబాట విస్తరణ
- తెరవెనుక బడాబాబులు ఉన్నట్టు ఆరోపణలు



శేషుగెడ్డ రిజర్వాయర్‌కు అనధికారికంగా నిర్మిస్తున్న మెటల్ రోడ్డు

ఎలమంచిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): **ఇరిగేషన్ శాఖకు చెందిన భూమిలో నుంచి గ్రావెల్ రోడ్డు వేసుకుంటామని అనుమతులు తీసుకుని ఏకంగా మెటల్ రోడ్డు వేస్తున్నారు. అంతటితో ఆగకుండా అక్కడి నుంచి రిజర్వు ఫారెస్టు భూముల్లో వున్న కాలిబాటనుకాస్తా.. వాహనాలు వెళ్లడానికి అనువుగా చదును చేస్తున్నారు. అయినప్పటికీ ఈ రెండు శాఖల అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.**

ఎలమంచిలి పట్టణానికి పశ్చిమ దిశలో పెదపల్లికి ఎగువున శేషుగెడ్డ రిజర్వాయర్ వుంది. దీనిపైన రిజర్వు ఫారెస్టు వుంది. ఈ ప్రాంతంలో కురిసే వర్షపు నీరు శేషుగెడ్డ రిజర్వాయర్‌లోకి చేరుతుంది. దీని నుంచి సుమారు 800 ఎకరాల ఆయకట్టుకు నీరు అందుతుంది. కాగా పెదపల్లి నుంచి శేషుగెడ్డకు వెళ్లే మట్టి రోడ్డు పాడైపోవడంతో గ్రావెల్‌తో అభివృద్ధి

... మిగతా 6వ పేజీలో



పెదపల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో వాహనాలు వెళ్లేలా చదును చేసిన కాలిబాట

ఇంటర్ సెకండియర్ పరీక్షకు 12,038 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభం అయ్యాయి. సాధారణ, ఒకేషనల్ పరీక్షలకు 12,038 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొత్తం 34 కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షలకు జనరల్ అభ్యర్థులు 9,987 మందికిగాను 9,797 మంది హాజరయ్యారు. 190 మంది పరీక్షకు గైర్హాజరయ్యారు. ఒకేషనల్ విద్యార్థులు 2,331 మంది పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా 2,241 మంది పరీక్ష రాశారు. 90 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (మంగళ)	6.08
సహరి (బుధ)	4.58

పెదగరువులో దాహం కేకలు

- నివాసాలకు కిలోమీటరు దూరంలో గెడ్డపై ఆధారపడుతున్న గిరిజనులు
- చలమలు తీసుకుని తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి



నివాసాలకు కిలోమీటరు దూరంలో గెడ్డలో ఊట నీటినిపట్టుకుంటున్న గిరిజనులు



బిందెలు, బకెట్లతో తాగునీటిని మోసుకొస్తున్న గిరిజన మహిళలు

రోలుగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వేసవి ఆరంభంలోనే మారుమూల గ్రామాల గిరిజనులు తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. మండలంలో అర్ల పంచాయతీ శివారు కొండ శిఖర గ్రామమైన పెదగరువులో గిరిజనులు తాగునీటికి అవస్థలు పడుతున్నారు. నివాసాలకు సుమారు కిలోమీటరు దిగువన వున్న గెడ్డలో చెలమలు తవ్వుకుని నీటిని పట్టుకోవాల్సి వస్తున్నది. అక్కడి నుంచి రాళ్లు, రప్పల మధ్య ఎగువన నివాసాలకు అష్టకష్టాలు పడుతూ నీటిని తెచ్చుకుంటున్నారు.

రోలుగుంట మండలం పెదగరువు గిరిజన గ్రామంలో 13 కుటుంబాలకు చెందిన 60 మంది ఆదివాసీలు నివసిస్తున్నారు. కొండల మీద వున్న ఈ గ్రామంలో అధికారులు కనీసం గ్రావిటీ నీటి

... మిగతా 6వ పేజీలో

మత్స్యకారులకు కాసులు కురిపించిన కచిడి చేపలు

» ఐదు చేపలు రూ.60 వేలు



అచ్యుతాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): 'కచిడి' చేపలు మత్స్యకారులకు కాసులు కురిపిస్తున్నాయి. ఈ మధ్యకాలంలో తరచూ అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక మత్స్యకారులకు సముద్రంలో కచిడి చేపలు చిక్కుతున్నాయి. సోమవారం సుమారు 60 కిలోల బరువు ఉన్న ఐదు చేపలను రూ.60 వేలకు ఒక చేపల వ్యాపారి కొనుగోలు చేశారు. ఈ చేప పిట్టును మందుల తయారీలో వినియోగిస్తారని, అందుకే అంత గిరాకీ అని వ్యాపారులు, మత్స్యకారులు చెబుతుంటారు. సాధారణంగా ఏ చేప అయినా గేలానికి ఎరగా ఏది వేసినా ఆహారం దొరికిందని తినేందుకు ప్రయత్నించి దొరికిపోతుంది. కానీ కచిడి చేప మాత్రం బతికున్న మరో చేపను ఎరగా వేస్తే తప్ప గేలానికి చిక్కదని మత్స్యకారులు తెలిపారు. ఇవి నీటిలో రాళ్ల మధ్య ఎక్కువగా ఉంటుంటాయన్నారు. కాగా 20 కిలోల కంటే ఎక్కువ బరువు గల చేప పడితే రెండు లక్షల రూపాయలు పలుకుతుందంటున్నారు. ఎందుకంటే పెద్ద చేపలో పిట్టు ఎక్కువగా ఉంటుందని చేపల వ్యాపారులు తెలిపారు.

క్షయ వ్యాధిపై అవగాహన అవసరం

రాంబిల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఆర్.వెంకటేష్ అన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్తిభారత్ పంచాయతీలుగా ఎంపిక చేసిన మురకాడ, కట్టుబోలు, మామిడివాడ, లాలంకోడూరు కార్యదర్శులు, వైద్యసిబ్బందికి సోమవారం దిమిలి పీహెచ్‌సీలో క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి వెంకటేష్ మాట్లాడుతూ దగ్గు, ఆకస్మికంగా బరువు తగ్గడం, ఆకలి మందగించడం, రోజు విడిచి జ్వరం రావడం వంటివి క్షయవ్యాధి లక్షణాలన్నారు. ఈనెల 24న జరిగే ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం రోజున పంచాయతీ కార్యదర్శులకు డీఎంహెచ్‌వో ప్రశంసా పత్రాలు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్ఎస్‌వీఎస్ రాజు, పంచాయతీల కార్యదర్శులు కె.అమ్మాజి, బి.అనురాధ, బీవీఎస్ఎన్ ప్రసాద్, రాధిక, సత్యనారాయణ, రోజారమణి, ఎల్లాజి పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా జిల్లా

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం భూమి కేటాయించింది. ఇంకా నక్కపల్లి ఎస్ఈజడ్‌లో ఆర్సెల్లార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇంకా మత్స్య, సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, పూడిమడక, నక్కపల్లి సముద్ర తీర ప్రాంతాల్లో జెట్టీల ఏర్పాటు పనులు వేగంగా జరుగుతున్నాయి. అనకాపల్లి మండలం కోడూరు ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే మౌలిక వసతుల కల్పనలో వృద్ధి కనిపిస్తున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల రహదారులతోపాటు జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయి. అనకాపల్లి నుంచి పాయకరావుపేట మీదుగా రాజమహేంద్రవరం వరకు ప్రస్తుతం వున్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఆరు లేన్లకు విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. విద్యుత్, నీటి పారుదల రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

ప్రభుత్వ భూముల్లో దర్జాగా రోడ్ల నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

చేసుకుంటామని ఇటీవల సాగునీటి సంఘం ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు. రైతుల ప్రయోజనం కోసమే అన్న ఉద్దేశంతో ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. అయితే అనుమతులు తీసుకున్న ఆ వ్యక్తులు.. శేషుగెడ్డలో గ్రావెల్ తవ్వి సుమారు కిలోమీటరు మేర రోడ్డుకు వినియోగించారు. అంతేకాక మట్టి రోడ్డుపై మెటల్ రోడ్డు వేస్తున్నారు. ఇదే సమయంలో శేషుగెడ్డకు ఎగువన అటవీ భూముల్లో ఎప్పటి నుంచో వున్న కాలిబాటను, వాహనాలు వెళ్లేలా చదును చేశారు. ఈ మార్గం కోటవురట్ల మండలం పందూరు వద్దకు చేరుతుంది. ఈ ప్రాంతంలో కొంతమంది బడాబాబులకు ఫామ్ హౌస్‌లు వున్నాయని, వారే అక్రమంగా రోడ్లు వేయిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటు ఇరిగేషన్ శాఖ, అటు అటవీ శాఖ భూముల్లో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం వెనుక వీరి హస్తం వుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాగా అటవీ భూముల్లో నడక దారిని, వాహనాలు వెళ్లేలా చదును చేసిన విషయం తెలుసుకున్న ఎలమంచిలి అటవీ అధికారి అనిల్‌కుమార్, సెక్షన్ అధికారి వెంకటరమణ సోమవారం సిబ్బందితో అక్కడకు వెళ్లి పరిశీలించారు. కాలి బాటను చదునుచేయించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని వెంకటరమణ తెలిపారు. కాగా పెద్దపల్లి నుంచి శేషుగెడ్డకు వెళ్లే మార్గంలో అక్రమంగా మెటల్ రోడ్డు వేయడంపై నీటిపారుదల శాఖ ఏఈ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. స్థానిక నీటి సంఘం ప్రతినిధి ఒకరు.. పాడైన రిజర్వాయర్ రోడ్డును అభివృద్ధి చేసుకోవడానికి మట్టి పనులు చేపడతామని చెప్పారని, ఈ రోజు వెళ్లి పరిశీలిస్తే.. నల్ల పిక్కతో (మెటల్) రోడ్డు నిర్మిస్తున్నారని, వెంటనే పనులు నిలుపుదల చేయించామని చెప్పారు. దీనిపై మరింత లోతుగా విచారించి, బాధ్యులపై చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

పెదగరువులో దాహం కేకలు

... 5వ పేజీ తరువాయి

పథకాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీటి సమస్య గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో 2019లో గ్రామస్థులంతా మూడు నెలల కష్టబడి శ్రమదానంతో బావి తవ్వుకున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులతో బావికి విద్యుత్ మోటారు అమర్చి, నీటి సరఫరాకు పైపులు వేశారు. అయితే కొద్ది కాలానికే గొట్టాలు తుప్పుపట్టి పాడైపోయాయి. జీఐ పైపుల స్థానంలో పీవీసీ పైపులు వేయాలని అధికారులను కోరారు. కానీ ఎన్నాళ్లయినా పట్టించుకోలేదు. అప్పటి నుంచి తాగునీటి కోసం గెడ్డపై ఆధారపడుతున్నారు. వర్షాకాలంలో కలుషిత నీటి వల్ల వ్యాధులబారిన పడుతున్నామని, వేసవిలో చలమలు తీసుకుని నీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వ నేతలు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

డ్వాక్రా పొదుపు సొమ్ము రూ.4 లక్షలు స్వాహా

» వెలుగు బుక్‌కీపర్ నిర్వాకం

» రాజగోపాలపురం పెద్దల వద్ద పంచాయితీ

» స్వాహా చేసిన సొమ్ము చెల్లించేందుకు అంగీకారం



రాజగోపాలపురంలో పంచాయితీ నిర్వహిస్తున్న గ్రామ పెద్దలు, బ్యాంకు, వెలుగు అధికారులు

కోటవురట్ల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో అక్షయ, భవానీ, వేణు డ్వాకా గ్రూపు సభ్యులు పొదుపు చేసుకున్న రూ.4 లక్షలను ఫోర్జరీ సంతకాలతో వెలుగు విలేజ్ బుక్ కీపర్ వేణుమ్మ స్వాహా చేసింది. భవానీ గ్రూపు సభ్యులకు స్టేట్‌బ్యాంకు అధికారులు గతంలో రూ.7.5 లక్షలు రుణం మంజూరు చేసింది. ఆ గ్రామ వెలుగు విలేజ్ బుక్ కీపర్ వేణుమ్మతో గ్రూపు అధ్యక్షురాలు చేతులు కలిపి గ్రూపు సభ్యులకు తెలియకుండా రూ.2.5లక్షలు వ్యక్తిగత రుణం తీసుకున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి రావడంతో గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టారు. వేణుమ్మను గ్రామపెద్దలు మందలించడంతో బ్యాంకు అప్పు రూ.2.5 లక్షలు స్వయంగా తీర్చుకుంటానని అంగీకరించింది. అదేకాకుండా ఆమె అక్షయ గ్రూపు సభ్యులకు తెలియకుండా ఎనిమిది నెలల క్రితం రూ.47వేలు పొదుపు సొమ్మును సభ్యుల సంతకాలు ఫోర్జరీ చేసి తీసుకుంది. గ్రూపు సభ్యులు పొదుపు బ్యాంకు పాస్‌బుక్ అప్‌డేట్ చేయడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఈ అప్పును వేణుమ్మ గ్రూపు సభ్యులకు తెలియకుండా కట్టేసింది. వేణుమ్మ తీసుకున్న అప్పునకు వడ్డీ తమపై పడుతుందని గ్రూపుసభ్యులు ఆమెను నిలదీశారు. అలాగే వేణుగ్రూపులో వేణుమ్మ సభ్యురాలు కావడంతో పొదుపు సొమ్మును గ్రూపు అధ్యక్షకార్యదర్శులకు తెలియకుండా రూ.లక్ష స్వాహా చేసింది. ఈ విషయం బయట పడడంతో గ్రూపుసభ్యులు గ్రామపెద్దల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామ పెద్దలు పంచాయితీ పెట్టి వేణుమ్మను మందలించారు. ఈ విషయాన్ని బ్యాంకు అధికారులు వెలుగు అధికారుల దృష్టికి వెళ్లారు. సోమవారం వెలుగు, బ్యాంకు అధికారులు అన్ని గ్రూపుల సభ్యులతో సమావేశం నిర్వహించి, వేణుమ్మ తప్పులను అందరి ముందు ఉంచారు. దీంతో తాను అన్ని అప్పులు తీరుస్తానని వేణుమ్మ అంగీకరించింది. దీంతో డ్వాక్రా గ్రూపు సభ్యులు శాంతించారు.

బల్క్‌డ్రగ్ పరిశ్రమల కోసం భూముల సర్వే



పెదతీనార్లలో జిరాయితీ భూముల సర్వే చేస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పరిశ్రమల కోసం అదనపు భూముల సేకరణ పనిలో ప్రభుత్వ యంత్రాంగం నిమగ్నమైవుంది. ఇప్పటికే పెదతీనార్ల, జానకయ్యపేట గ్రామాల్లో జిరాయితీ, ప్రభుత్వ భూముల సేకరణపై అధికారులు గ్రామసభలు నిర్వహించారు. తాజాగా సోమవారం పెదతీనార్ల, సీహెచ్ఎల్ పురం గ్రామాల్లో భూముల సర్వేను తహసీల్దార్ నర్సింహమూర్తి, వీఆర్వో చిట్టిబాబు ఆధ్వర్యంలో చేపట్టారు. పెదతీనార్ల, సీహెచ్ఎల్ పురం గ్రామాల్లో 800 ఎకరాలు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఎంపిక చేసిన ప్రభుత్వ, ప్రైవేట్ భూములను అధికారులు పరిశీలిస్తున్నారు.

జాతీయ హాకీ పోటీలకు ముగ్గురి ఎంపిక

ఎలమంచిలి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీనియర్ హాకీ జాతీయ పోటీలకు అనకాపల్లి జిల్లా నుంచి ఎలమంచిలికి చెందిన ముగ్గురు క్రీడాకారిణిలు ఎంపికైనట్టు హాకీ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ కొఠారు నరేష్ సోమవారం తెలిపారు. ఎంపికైన వారిలో ఎలమంచిలి పట్టణానికి చెందిన భవానీ, మేరీ, కుసుమలు ఉన్నారన్నారు. గత నెలలో నెల్లూరులో జరిగిన రాష్ట్ర టోర్నీలో వీరు అత్యంత ప్రతిభ కనబరచడంతో జాతీయ పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు. జాతీయ జట్టుకు ముగ్గురు క్రీడాకారిణిలు ఎంపిక కావడం పట్ల ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అభినందనలు తెలిపారు.



జాతీయ పోటీలకు ఎంపికైన హాకీ క్రీడాకారిణిలు

కిశోర బాలికలకు బాల్య వివాహాలపై అవగాహన



నక్కపల్లిలో మహిళా దినోత్సవంపై ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



మునగపాకలో కిశోర్ బాలికలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

నక్కపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినదొడ్డిగల్లు జడ్పీ హైస్కూల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సత్యవతి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. 8న మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలతో కోటి సంతకాల సేకరణ చేశారు. కిశోర్ బాలికలతో ప్రతిజ్ఞ, మానవహారం చేశారు. బాల్య వివాహాల నివారణ గురించి సూపర్‌వైజర్ సత్యవతి అవగాహన కల్పించారు.

మునగపాకలో..

బాల్య వివాహాలు నేరమని, వాటిని నిర్వహించినా, ప్రోత్సహించినా శిక్షార్హులవుతారని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్‌వో ఆర్.దేవకాంత అన్నారు. మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మునగపాక జడ్పీ స్కూల్లో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర్ బాలికలు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ప్రముఖ అర్చకుడు వెలవలపల్లి కోటేశ్వరశర్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

ఎలమంచిలిలో..

సోమలింగపాలెం, ఏటికొప్పాక గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఐసీడీఎస్ అధికారుల పర్యవేక్షణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమలింగపాలెంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రంజని, ఏటికొప్పాకలో జి.సుహాసినిల పర్యవేక్షణలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నివారణకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం. బీవీఎస్. సాయిబాబా, మహిళా పోలీస్ ఇరానీ ఫాతిమా, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి, విజయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రాంబిల్లిలో..

బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత అందరిపైన ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్వీఎస్ రాణి అన్నారు. అంతర్జాతీయ మహిళాదినోత్సవం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని లాలంకోడూరు హైస్కూల్లో బాల్య వివాహాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిశోర్ బాలికలతో కలిసి మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సచివాలయం కార్యదర్శి అంగన్‌వాడీలు, కిశోర్ బాలికలు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

బాల్య వివాహాల నివారణకు అంతా సహకరించాలని ఐసీడీఎస్ పర్యవేక్షకులు అపరంజిని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పూడిమడక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లారు. మహిళలు బాగా చదువుకొని అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనంతరం బాల్య వివాహాలు అడ్డుకోవడానికి తాము సిద్ధమంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పద్మ, రేవతి, రత్నకుమారి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

... 5వ పేజీ తరువాయి



ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

కేటాయించిన సిబ్బంది లెక్కించారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులునాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వందకంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు 20,1345లో 10,067 ప్లస్ ఒకటి...10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివ ప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గా ప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి మొదటి స్థానంలో నిలిచిన శ్రీనివాసులునాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులునాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.

మొదటి ప్రాధాన్య ఓట్లు ఎవరికెన్ని వచ్చాయంటే...

మొత్తం 20,794 ఓట్లు పోలవ్వగా 659 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 20,135 ఓట్ల (మొదటి ప్రాధాన్య)లో కోరెడ్ల విజయగౌరికి 5,804, కోసూరు రాధాకృష్ణ కు 30, గాదె శ్రీనివాసులనాయుడుకు 7210, దుర్గాప్రసాద్ పోతలకు 67, నూకల సూర్యప్రకాష్‌కు 85, ఎస్.ఎస్.పద్మావతికి 15, పాకలపాటి రఘువర్మకు 6845, పెదపెంకి ప్రసాదరావుకు 15, రాయల సత్యనారాయణకు 31, సుంకరి శ్రీనివాసరావుకు 33 ఓట్లు వచ్చాయి.

'గాదె'కు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేత

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి 11 గంటలకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత అధికారికంగా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందించారు.

ఓటమి పాలైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

పాకలపాటి రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టంచేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

శివాలయం నిర్మాణానికి రూ.3,33,333 విరాళం



శివాలయ నిర్మాణానికి విరాళం చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమారపురంలో నిర్మిస్తున్న కుమార ఉమారామలింగేశ్వరస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన భక్తుడు నీలాపు అచ్చియ్యరెడ్డి కుమారుడు నీలాపు వేణువెంకటకృష్ణారెడ్డి 3లక్షల 33 వేల 333 రూపాయల చెక్కును సోమవారం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వాహకులకు విరాళంగా అందజేశారు. వెంకట కృష్ణారెడ్డి తన పుట్టిన రోజు సందర్భంగా విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ నిర్మాణ నిర్వాహకులు అచ్చియ్యరెడ్డి దంపతులు, వెంకటకృష్ణారెడ్డిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నీలాపు బాలకృష్ణారెడ్డి, పిరుమళ్ల రామకృష్ణ, నీలాపు బాలానందరెడ్డి, నీలాపు మహేశ్‌రెడ్డి, రావాడ గోవిందరెడ్డి, నీలాపు వెంకటరెడ్డి, అప్పలరెడ్డి, యన్నంరెడ్డి నాగేశ్వరరావు రెడ్డి, నీలాపు రెడ్డిబాబు, కాలపురెడ్డి దొరబాబు రెడ్డి, నరసింహరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంపద సృష్టి పేరుతో ప్రజలకు వాతలు

» వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్



విలేకర్లతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

మునగపాక, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సంపద సృష్టించి అభివృద్ధిని చూపిస్తానంటూ ఎన్నికల సమయంలో చంద్రబాబు మాటలను ప్రజలు నమ్మారని, అధికారంలోకి వచ్చిన తరువాత భారీగా వాతలు పెడుతున్నారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ ఆరోపించారు. స్థానిక ప్రసాద్ క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకపోతే వెయ్యి రూపాయలు, లైసెన్స్ లేకపోతే దశలవారీగా భారీగా జరిమానాలు, మద్యం సేవించి పట్టుబడితే రూ.10వేలు ఇలా ఎడాపెడా ప్రజలను ఆర్థికంగా బాధిస్తున్నారన్నారు. అమ్మకు వందనం, రైతుభరోసా, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలు ఇంకా అమలుకు నోచుకోలేదన్నారు. ఈ సమావేశంలో అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

వెంకన్న ఉత్సవాలకు విస్తృత ప్రచారం



ఆటోల ద్వారా ప్రచారానికి శ్రీకారం చుట్టిన దృశ్యం

నక్కపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9 నుంచి ప్రారంభం కానున్న ఉపమాక వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు విస్తృత ప్రచారం చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు సోమవారం ఆటోలకు మైక్‌లు కట్టి ఉమ్మడి విశాఖ ఏజెన్సీ కాకినాడ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఉత్సవ ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఆలయం వద్ద ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, మాజీ చైర్మన్ కొప్పిశెట్టి కొండబాబు ఆటో ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవ వాల్‌పోస్టర్లను కూడా ఆటోల ద్వారా పంపిస్తున్నారు. కార్యక్రమంలో పవన్ కుమార్, రవి,దుర్గ, తోలేటి శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయం వార్షికోత్సవం

పాయకరావుపేట రూరల్, మార్చి3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాసాహెబ్‌పేటలో సోమవారం సాయిబాబా ఆలయం 12వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు సాయిబాబా వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్థుల సహకారంతో ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.

'ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా లేదు'

నక్కపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని వైసీపీ నేత వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం గొడిచెర్ల ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చెప్పే మాటలకు, చేసే పనులకు పొంతన వుండడం లేదన్నారు. 24 శాతం కూడా ధాన్యం కొనుగోలు జరగలేదన్నారు. వైసీపీ పాలనలో ధాన్యాన్ని కొనుగోలు చేసిన ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోనే నగదు జమ చేసేదన్నారు.

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన

అచ్యుతాపురం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్‌లో ఎంఎస్ఎంఈ టూల్ రూం కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హైదరాబాద్, విజయవాడలకు చెందిన అధికారులు విజయ లక్ష్మీకాంత్, విజయకృష్ణ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్ర ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రశాంతి విద్యాసంస్థల చైర్మన్ ధర్మిరెడ్డి ప్రసాద్, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఎంఎస్ఎంఈ సమన్వయకర్త కేఎస్ఎస్ ప్రకాశ్ పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు, ఎస్.రాయవరం సబ్ స్టేషన్ల పరిధిలో ఎస్.రాయవరం, వాకపాడు, వమ్మవరం, గెడ్డపాలెం, అగ్రహారం గ్రామాల్లో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. వినియోగదారులంతా సహకరించాలని కోరారు.

ఘనంగా ప్రపంచ వన్యప్రాణి దినోత్సవం

ఎస్.రాయవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన గుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో పాయకరావుపేట అటవీ సెక్షన్ అధికారుల ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు పోటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన మొదటి ముగ్గురి విద్యార్థులకు అటవీ శాఖ అధికారులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో ఎల్.విజయకుమార్, ఎం.కృష్ణ, ఎఫ్‌బీవో కె.రమణమ్మ, పి.ఆచారి, ఏబీవో బీవై నాయుడు, హెచ్ఎం బి.సత్తిబాబు, పీడీ ప్రేమ్ పాల్గొన్నారు.

గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక నిఘా

▸▸ సేవించేవారి సమాచారం సేకరించండి ▸▸ రౌడీషీటర్లలో సత్ప్రవర్తనకు కౌన్సెలింగ్ ▸▸ ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశం ▸▸ పట్టణ స్టేషన్ తనిఖీ

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు సేవించేవారి సమాచారం సేకరించి నిఘా ఉంచాలని జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా స్పష్టం చేశారు. సోమవారం సాయంత్రం అనకాపల్లి పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకుని సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గంజాయి రవాణా కట్టడికి అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. గంజాయిని సేవించే వారి సమాచారాన్ని సేకరించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు నమోదు చేసి, రౌడీషీటర్లలో సత్ప్రవర్తనకు తరచూ కౌన్సెలింగ్ నిర్వహించాలన్నారు. చోరీలు, నేరాలను అరికట్టేందుకు పగలు, రాత్రి గస్తీ ముమ్మరం చేయాలని ఆదేశించారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా సంరక్షణ కార్యదర్శులు స్థానిక పోలీసులతో కలిసి విద్యా సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణతో కలిసి సుంకరమెట్ట జంక్షన్, నెహ్రూచౌక్, పెరుగుబజార్ జంక్షన్‌లను పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్, ట్రాఫిక్ సీఐ ఎం.వెంకటనారాయణ, పట్టణ ఎస్‌ఐలు డి.ఈశ్వరరావు, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసుల వివరాలను సీఐల ద్వారా తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా

వినికిడి సమస్యపై అశ్రద్ధ వద్దు

▸▸ ప్రపంచ వినికిడి దినోత్సవ ర్యాలీలో డీఎంహెచ్‌వో రవికుమార్



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వినికిడి దినోత్సవం సందర్భంగా డీఎంహెచ్‌వో కార్యాలయ వైద్యాధికారులు, సిబ్బంది సోమవారం ఇక్కడ ర్యాలీ నిర్వహించారు. ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమైంది. తొలుత డీఎంహెచ్‌వో పడాల రవికుమార్ మాట్లాడుతూ ప్రజలంతా చెవి, వినికిడి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వినికిడి సమస్య, చెవికి సంబంధిత సమస్యలు తలెత్తిన సందర్భంలో ఆలస్యం చేయకుండా తగిన వైద్య సహాయం పొందాలని సూచించారు. ప్రభుత్వపరంగా అందజేస్తున్న వినికిడి పరికరాలు, పూర్తిగా చెవుడు వచ్చిన వారికి ప్రభుత్వపరంగా ఇస్తున్న పింఛన్, ఇతర రాయితీలు గురించి క్షేత్రస్థాయి సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, జాతీయ ఆరోగ్య మిషన్ జిల్లా అధికారిణి డాక్టర్ జె.ప్రశాంతి, వైద్యులు కృష్ణారావు, వినోద్‌కుమార్, క్రాంతి, రమేష్, పృథ్వీ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందాంధ్ర కోసం ట్రిపుల్ ఇంజన్ సర్కార్

▸▸ బడ్జెట్‌పై చర్చలో 'కొణతాల'

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆనందకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం ట్రిపుల్ ఇంజన్ సర్కార్ పని చేస్తోందని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ(జనసేన) వ్యాఖ్యానించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. స్వార్థ ప్రయోజనాలతో గత వైసీపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని భ్రష్టుపట్టిస్తే పురాణాల్లో త్రిమూర్తుల్లా నరేంద్రమోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ ట్రిపుల్ ఇం జన్ సర్కార్ తరహాలో బాగుచేస్తున్నారని కొనియాడారు. అమరావతిని నాశనం చెయ్యాలనుకున్న వ్యక్తి(జగన్) నాశనం అయ్యాడని, కేంద్రం సహకారంతో రాష్ట్రానికి అద్భుత రాజధాని చంద్రబాబు నిర్మిస్తు న్నారని గుర్తు చేశారు. వెనుకబడిన ఉత్తరాంధ్రకు రైల్వేజోన్‌తో పాటు లక్షల కోట్ల అభివృద్ధి పనులకు నరేంద్ర మోదీ శంకుస్థాపన చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ వికాసానికి పవన్ కల్యాణ్ శ్రమిస్తున్నట్లు వివరించారు. రాష్ట్రానికి 2019లో పట్టిన చీడ, పీడ, దరి ద్రం పోయి 2024లో అదృష్టం పట్టడంతో వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల, పట్టణాభివృద్ధికి అత్యధిక నిధులు కేటాయిస్తూ విజన్ 2047 దిశగా ఆంధ్రప్రదేశ్‌ను కూటమి ప్రభుత్వం తీసుకెళుతోందన్నారు.

10న దేమునిగుమ్మం వేంకటేశ్వర స్వామి కల్యాణం

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల పదో తేదీన శ్రీవారి కల్యాణోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చురుగ్గా ఏర్పాట్లు చేపడుతున్నారు. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రాంకీ సోమవారం స్వామివారిని దర్శించుకున్నారు. కల్యాణోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిందిగా కోరారు. జనసేన నాయకులు పీలా నాగశ్రీను, దాడి బుజ్జి, చదరం నాగేశ్వరరావు, దూలం గోపి తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షకు 1190 మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ఇంటర్ ఇంగ్లీషు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగినట్టు డీఈవో అప్పారావునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు 1300 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 1190 మంది విచ్చేసినట్టు చెప్పారు. తెలిపారు. అనకాపల్లి పరిధిలో ఐదు కేంద్రాల్లో, ఎలమంచిలిలో రెండు కేంద్రాల్లో ఈ పరీక్షలు జరిగాయన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలపై ఆందోళన



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న యూనియన్ నాయకులు

తుమ్మపాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గనిశెట్టి ఏసుదాసు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆప్కాస్ విధానాన్ని రద్దు చేసి కాంట్రాక్టర్లకు అప్పగించడంతో వారు కార్మికులతో వెట్టిచాకిరీ చేయిస్తున్నారని ఆరోపించారు. సకాలంలో వేతనాలు కూడా చెల్లించడం లేదన్నారు. వెంటనే సదరు కార్మికులకు రూ.26వేలు వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్మికులు వేమగిరి రాజు, కుమార్, టి.శ్రీను, ఇ.చంద్రరావు, ఎం.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాహన మిత్ర పథకాన్ని అమలు చేయాలని వినతి

తుమ్మపాల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : వాహన మిత్ర పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సీపీఐ నాయకులతో కలిసి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి నేతలు ఎన్నికల ముందు వాహన మిత్ర పథకాన్ని అమలు చేసి, ఆయా లబ్ధిదారులకు రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా అమలు చేయకపోవడం తగదన్నారు. ఆటో కార్మికులు చాలీచాలని ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్న తరుణంలో వివిధ రూపాల్లో చాలానాలను విధిస్తూ పోలీసులు మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆటో, మోటార్ వెహికల్ డ్రైవర్లకు పీఎఫ్, ఈఎస్ఐ, పెన్షన్‌తో కూడుకున్న సమగ్ర సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వారధి గోవిద్, పెదిరెడ్ల నాగేశ్వరరావు, వియ్యపు రాజు, త్రినాథ్, కేఎస్ రావు, మహేష్, రామ్మోహన్, కోరుబిల్లి శంకరరావు, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఆర్టీసీ కార్మికుల రిలే దీక్షలు

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట ఎన్ఎంయూఏ కార్మికుల రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఈ శిబిరంలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వి.అప్పారావు మాట్లాడుతూ 1/2019 సర్క్యులర్‌కు విరుద్ధంగా డ్రైవర్, కండక్టర్‌లను అక్రమంగా సస్పెండ్ చేయడం తగదన్నారు. డిపోలో ఉద్యమానికి ప్రధాన కారణం యాజమాన్యమేని, డిపో మేనేజర్ రెచ్చగొట్టే ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నాయకులు శంకరరావు, ఆర్.ఎస్.రాజు, పి.చిన్నారావు, వి.అప్పారావు, ఎం.ఈశ్వరరావు తదితరులు దీక్షలో కూర్చున్న వారికి సంఘీభావం తెలిపారు.

6న సమస్యలపై ఆశ వర్కర్లు 'చలో విజయవాడ'

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల ఆరో తేదీన నిర్వహించనున్న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు సోమవారం ఏడీఎంహెచ్‌వో రమేష్‌ను కలిసి యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఆశ కార్యకర్తలకు వేతనాలు పెంచాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, కోశాధికారి సూర్యకళ, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

తానాంలో జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ ప్రారంభం

పరవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తానాం గ్రామంలో ఈనెల తొమ్మిదో తేదీ నుంచి మూడు రోజులపాటు పరదేశిమాంబ ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కన్నూరు వెంకటరమణ సోమవారం టోర్నీని ప్రారంభించారు. విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. మాజీ జడ్పీటీసీ పైలా జగన్నాథరావు, స్థానిక నాయకులు వర్రి వసంతరావు, వర్రి వెంకటరమణ, గొరుపుటి సతీష్, పైలా జానకిరావు, అప్పారావు, కృష్ణారావు, రొంగలి అప్పారావు, కన్నూరు యువసేన సభ్యులు పాల్గొన్నారు.

జిల్లాలో మూతపడిన మద్యం దుకాణాలు

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్ల లెక్కింపు కారణంగా సోమవారం జిల్లాలోని మద్యం షాపులను ఎక్సైజ్ అధికారులు మూసివేశారు. ఓట్ల లెక్కింపులో భాగంగా అధికారులు ఆదివారం రాత్రి పది గంటలకు దుకాణాలను దగ్గరుండి మూయించి వేసి సీలు వేశారు. జిల్లాలోని 146 మద్యం దుకాణాలు, పది బార్లు సోమవారం మూతపడ్డాయి. తిరిగి మంగళవారం యథావిధిగా తెరుచుకోనున్నాయి.

స్నేహితురాలి కుటుంబానికి ఆర్థిక సాయం

పరవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 79వ వార్డు దేశపాత్రునిపాలెం హైస్కూల్‌లో 2003-04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నవారంతా ఉదారతను చాటుకున్నారు. తమతో పాటు చదువుకున్న స్నేహితురాలు మరడాన దేవి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందడంతో ఆమె కుటుంబానికి అంతాకలిసి రూ.45 వేలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

ప్రతీ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదగాలి

▸▸ ఎంఎస్ఎంఈ సమావేశంలో వక్తలు

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మహిళ ఓ పారిశ్రామికవేత్తగా ఎదగాలని వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక హోటల్‌లోని సమావేశమందిరంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెగా ఎంఎస్ ఎంఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ జీఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు బ్యాంక్ నుంచి ప్రోత్సా హం అందిస్తున్నామన్నారు. ఇటీవల కాలంలో విశాఖలో నారీశక్తి బ్రాంచ్ ప్రారంభించినట్టు చెప్పారు. ఈ ప్రాంతంలో ఉన్న ప్రజల్లో చైతన్యాన్ని గుర్తించి యాజమాన్యం ప్రత్యేకంగా నారీశక్తిశాఖను ప్రారంభించిందన్నారు. బ్యాంకు ద్వారా తీసుకున్న రుణాలతో ఆర్థికాభివృద్ధి చెంది సకాలంలో బ్యాంకుకు చెల్లించాల్సిన రుణాలను చెల్లించాలని సూచించారు. వచ్చిన లాభాల్లో సగం నిల్వ చేసుకొని భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. స్వయం సహాయక సంఘాలు తయారు చేసే పదార్థాలు గుర్తింపు పొందే విధంగా కృషి చేయాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ ఎ.శచీదేవి మాట్లాడుతూ బ్యాంకు యాజమాన్యం మెగా ఎంఎస్ఎంఈ క్యాంప్ పెట్టడం అభినందనీయమన్నారు. డ్వాక్రా మహిళలకు తమ సంస్థ తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలందిస్తామన్నారు.

యూనియన్ విశాఖ జోన్ హెడ్ శాలిని మాట్లాడుతూ నారీశక్తి బ్రాంచి గురించి వివరించారు. అనంతరం స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం జీఎం నాగరాజు, పలు బ్రాంచ్‌ల మేనేజర్లు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ మేనేజర్ రమణ

భవిత కేంద్రానికి కుర్చీలు, కంచాలు



కంచాలు అందజేస్తున్న సీఐ స్వామినాయుడు

కశింకోట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులను విద్యావంతులుగా తీర్చిదిద్దేందుకు మరింత కృషి చేయాలని సీఐ అల్లు స్వామినాయుడు కోరారు. ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలో ఉన్న భవిత కేంద్రానికి సోమవారం ఆయన 30 కంచాలు, 30 గ్లాసులు, 10 కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అంధ త్వాన్ని జయించి లక్ష్యాన్ని సాధించే దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కె.వి.సురేష్, కేఎస్ఎన్ మూర్తి, డీపీఎన్ జడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎం ఆచంట రవి, నంబరు-2 పాఠశాల హెచ్‌ఎం బి.రామునాయుడు, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ కొరుప్రోలు వెంకటేశ్వరరావు, భవిత కేంద్రం ఐఈఆర్‌పీలు బి.వి.రమణమ్మ, ఎస్.దీప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయ ఆలయ వార్షికోత్సవం



స్వామిని దర్శించుకుంటున్న న్యాయ వర్సిటీ వీసీ

సబ్బవరం, మార్చి 3(ఆంధ్రజ్యోతి) : గొటివాడలో అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. సబ్బవరం దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం ఉప కులపతి డి.సూర్యప్రకాశరావుతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వడిసల రామలక్ష్మణల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో గ్రామ పెద్దలు బొండా సత్యారావు, వడిసల రమేష్, శ్రీరామ్, లక్ష్మణ, సాలాపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

లంకెలపాలెం హైస్కూల్‌కు కంప్యూటర్ వితరణ



కంప్యూటర్ అందిస్తున్న సంస్థ ప్రతినిధులు

లంకెలపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు హెచ్‌పీసీఎల్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా కంప్యూటర్‌ను సమకూర్చారు. ఈ మేరకు సోమవారం సంస్థ ప్రతినిధులు హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావుకు అందజేశారు.ఈ కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ ప్రతినిధులు అన్నపూర్ణ, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు అపూర్వ కలయిక



పూర్వ విద్యార్థిని సత్కరిస్తున్న తోటి మిత్రులు


అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి గవరపాలెం హైస్కూల్‌లో 1956 నుంచి 2023 విద్యా సంవత్సరం వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు సుంకరమెట్ట జంక్షన్‌లోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రాత్రి కలుసుకున్నారు. తొలుత ఒకరినొకరు పరిచయం చేసుకుని, నాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. నిర్వాహకులు వివిధ ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రిటైర్డు పీఈటీ కేఎస్‌వీ సత్యనారాయణ, పూర్వ విద్యార్థుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు బొడ్డేడ అప్పారావు, సంఘం చైర్మన్ పిళ్లా శివఅప్పారావు, అధ్యక్షులు బల్లా నాగభూషణంలను సత్కరించారు. పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరు కావడంతో కోలాహల వాతావరణం నెలకొంది.

దంతెవాడ వరకే కిరండూల్ రైలు

విశాఖపట్నం, మార్చి3 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో ఆధునికీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండూల్ మధ్య నడుస్తున్న రైళ్ల సర్వీసులు ఈ నెల ఏడు నుంచి 16 వరకు విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా గమ్యాలను తాత్కాలికంగా కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైళ్లు ఈ నెల ఏడు నుంచి 15వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగుప్రయాణంలోని కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) రైళ్లు ఎనిమిది నుంచి 16వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయన్నారు. దంతెవాడ, కిరం డూల్ మధ్య రాకపోకలు తాత్కాలింగా రద్దు చేశామన్నారు.

గుడ్‌షెపర్డ్ స్కూల్ వార్షికోత్సవం రేపు

అనకాపల్లి టౌన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గుడ్‌షెపర్డ్ స్కూల్ 47వ వార్షికోత్సవం బుధవారం జరగనుంది. స్కూల్ ప్రాంగణంలో ఏర్పాట్లు చేస్తున్నట్టు కరస్పాండెంట్ పాల్ తెలిపారు. నెల్లూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ.కరుణకుమార్, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, డైట్ కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారన్నారు.



మహిళల హక్కులపై అవగాహన ర్యాలీలు



అనకాపల్లి నాలుగురోడ్ల కూడలిలో అవగాహన ర్యాలీ

కొత్తూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఈ నెల ఎనిమిదో తేదీన జరగనున్న నేపథ్యంలో ముందస్తుగానే ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా సోమవారం అనకాపల్లి పట్టణంతో పాటు పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో శశికళ హాజరై మహిళా దినోత్సవం ఆవశ్యకతను వివరించారు. అనంతరం 'స్త్రీ లేకపోతే జననం లేదు, గమనం లేదు' అన్న నినాదంతో అనకాపల్లిలోని నాలుగురోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా ట్రాఫిక్ పోలీసులు కూడా పాల్గొని మహిళలు ఆపదలో ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కశింకోట : ఇక్కడి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో బాలికలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సీఐ అల్లు స్వామినాయుడు హాజరై విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. విజేతలకు ఎనిమిదో తేదీన మహిళా దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామన్నారు.



జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొవ్వొత్తులతో ఐసీడీఎస్ సిబ్బంది ర్యాలీ

పరవాడ : ఐసీడీఎస్ సబ్బవరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి గొర్లెవానిపాలెం పంచాయతీ పరిధి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు షేక్ షకీలా, పి.లక్ష్మిలు మహిళల హక్కులపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లు, సచివాలయ గ్రామ రక్షకులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, పరవాడ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన హ్యాపీ అవర్స్ కార్యక్రమం సందడిగా సాగింది. పోలీస్ కుటుంబాల సభ్యులు, జీఎంఎస్‌కేలు, స్థానిక బాలికల వసతిగృహం విద్యార్థిను హాజరై ఉత్సాహంగా... ఉల్లాసంగా గడిపారు. వీరందరికీ వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. విజేతలకు సీఐ ఆర్.మల్లికార్జునరావు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం అల్పాహార విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు మహాలక్ష్మి, బి.కృష్ణారావు, రైటర్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు


విద్యార్థులతో ఉమెన్ ఎంపవర్మెంట్‌పై కొవ్వొత్తుల ర్యాలీ

పాడేరురూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలలో భాగంగా సోమవారం ఉమెన్ ఎంపవర్మెంట్‌పై అధికారులతో సంతకాల సేకరణ చేపట్టామని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎన్.సూర్యలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ డాక్టర్.ఎంజే.అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డీఈవో పి.బ్రహ్మాజీరావు, డీఎంహెచ్‌వో బాషా, డీఆర్‌డీఏ పీడీ మురళీ, డీఎల్‌పీవో కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి తదితరులు సంతకాలు చేశారు. అనంతరం ఏపీఆర్ కళాశాల ప్రాంగణంలో కళాశాల, పాఠశాల విద్యార్థినులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో పి.ఝాన్సీరాణి, సూపర్‌వైజర్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వల్పంగా పెరిగిన కనిష్ఠ ఉష్ణోగ్రతలు

పాడేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మన్యంలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి. దీంతో పొగమంచు ప్రభావం క్రమంగా తగ్గుతున్నది. సోమవారం హుకుంపేటలో 13.1 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా జీకేవీధిలో 13.4, జి.మాడుగులలో 13.6, అరకులోయలో 13.9, పాడేరు, చింతపల్లిలో 14.0, డుంబ్రిగుడలో 14.3, పెదబయలులో 14.8, ముంచంగిపుట్టులో 16.2, కొయ్యూరులో 18.3, అనంతగిరిలో 22.0 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే వాతావరణంలోని మార్పులతో ఎండ సైతం సాధారణంగానే కాసింది. చలి ప్రభావం తగ్గుముఖం పడుతున్నది.

నడింపాలెంలో మెరిసిన విద్యాకుసుమం

▸▸ ఎంబీబీఎస్ పట్టా పొందిన మానస

కొయ్యూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో నడింపాలెం గ్రామానికి చెందిన సుమర్ల మహేశ్వరి మానస ఎంబీబీఎస్ పట్టా పొంది మండలానికే వన్నె తెచ్చింది. ఆదివారం కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఆమె పట్టా స్వీకరించింది. నడింపాలెం గ్రామానికి చెందిన సుమర్ల రాము, సరస్వతిల కుమార్తె మహేశ్వరి మానస. చిన్నతనంలోనే ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న తండ్రి మూత్ర పిండాల సమస్యతో మృతి చెందాడు. అనంతరం తల్లి సరస్వతి సంరక్షణలో ఆమె పెరిగి ఎంబీబీఎస్ చేసింది. దీంతో నడింపాలెంలో పండగ వాతావరణం నెలకొంది. తల్లి సరస్వతి, కుమార్తె మానసలను పలువురు అభినందించారు.


ఎంబీబీఎస్ పట్టాతో మానస

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

కొయ్యూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలీసులు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈనెల 8 తేదీన జరగనున్న మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి. వెంకటరమణ పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ప్రశాంతంగా ఇంటర్ సెకండ్ ఇయర్ పరీక్షలు

పాడేరురూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం తొలి రోజు పరీక్ష సోమవారం ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి కె.అప్పలరామ్ తెలిపారు. జిల్లాలో జనరల్ గ్రూపు విద్యార్థులకు 26 పరీక్ష కేంద్రాల్లో, ఒకేషనల్ గ్రూపు విద్యార్థులకు 8 పరీక్ష కేంద్రాలలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్ గ్రూపు విద్యార్థులు సోమవారం పరీక్షలకు 6,669 మంది హాజరు కావాల్సి ఉండగా 6,445 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలకు 224 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 567 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 544 మంది మాత్రమే హాజరయ్యారు. ఇక్కడ 23 మంది గైర్హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ చీపురు రమాదేవి తెలిపారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన జేసీ

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ తనిఖీ చేశారు. సోమవారం ఉదయం పరీక్షా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న గదులు, సదుపాయాలను పరిశీలించారు. మాస్‌కాపీయింగ్‌కి అవకాశం లేకుండా పరీక్షలు నిర్వహించాలన్నారు.


పాడేరులో పరీక్ష రాసి వస్తున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు

ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలకు 83.3 శాతం మంది హాజరు

పాడేరురూరల్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏపీ సార్వత్రిక విద్యా పీఠం వారు నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు సోమవారం 83.30 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, అసిస్టెంట్ కమిషనర్ (ప్రభుత్వ పరీక్షలు) శశికుమార్ తెలిపారు. ఈ పరీక్షలను జిల్లాలో అరకువేలి, పాడేరు, చింతపల్లి, చింతూరు, రంపచోడవరంలో మూడు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సోమవారం ప్రారంభమైన తొలి రోజు పరీక్షకు 1,563 మంది హాజరు కావాల్సి ఉండగా 1,302 (83.30) శాతం మంది హాజరయ్యారని, 261 మంది గైర్హాజరయ్యారని వారు తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అరకువేలి పరీక్ష కేంద్రంలో 223 మందికి 207 మంది హాజరయ్యారన్నారు. అదేవిధంగా పాడేరులో 125 మందికి 112 మంది, చింతపల్లిలో 343 మందికి 308 మంది, చింతూరులో 207 మందికి 186 మంది, రంపచోడవరంలో 665 మందికి 489 మంది హాజరయ్యారన్నారు.

చింతపల్లిలో..

దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలకు 308మంది విద్యార్థులు హాజరయ్యారు. సోమవారం స్థానిక గిరిజన సంక్షేమశాఖ బాలుర ఆశ్రమ పాఠశాల-1, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాల్లో దూరవిద్య ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు పరీక్షకు బాలుర ఆశ్రమ పాఠశాల-1లో 164మందికి 153మంది హాజరుకాగా 11మంది గైర్హాజరయ్యారు. జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 179మందికి 155 మంది హాజరయ్యారు. 24మంది పరీక్షలు రాయలేదు. దూరవిద్య పరీక్షలకు పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

జిల్లాలో తాగునీటి ఎద్దడి సమస్య లేదు

▸▸ ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి జవహర్‌కుమార్

పాడేరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం తాగునీటి ఎద్దడి సమస్య లేదని, ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే 08935-298900 నంబర్‌కు కాల్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జిల్లా అధికారి కేఎస్.జవహర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలనే కలెక్టర్ ఆదేశాలతో అవసరమైన చర్యలు చేపట్టామన్నారు. ఫలితంగానే ప్రస్తుతం తాగునీటి సమస్యలు తలెత్తడం లేదన్నారు. అలాగే వేసవి ముందస్తు చర్యల్లో భాగంగా జిల్లాలోని 19 రక్షిత నీటి పథకాలను పరిశీలించామని, గ్రామాల్లో ఉన్న 2,237 రక్షిత నీటి పథకాలకు ఇప్పటికి 1,568 నీటి పథకాలను పరిశీలించామన్నారు. మిగిలిన వాటిని ఈనెల 15 నాటికి పరిశీలిస్తామన్నారు. అలాగే జిల్లాలో ఉన్న 727 బహుళ ప్రయోజన రక్షిత నీటి పథకాలను పరిశీలించి, అవసరమైన మరమ్మతులు చేపట్టామని, జిల్లాలోని 334 గ్రామ పంచాయతీల్లో ఉన్న 9,057 బోర్లకు 6,068 బోర్లను పరిశీలించామన్నారు. మిగిలిన వానికి ఈనెల 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. అలాగే జిల్లాలో ఎక్కడైనా తాగునీటి సమస్యలుంటే తక్షణమే 08935- 298900 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు. అలాగే తాగునీటి ట్యాంకులను ప్రతి నెలా మూడో శనివారం విధిగా క్లోరినేషన్ చేయిస్తున్నామని జవహర్‌కుమార్ పేర్కొన్నారు.

‘గాదె’ విజయంపై టీచర్ల సంబరాలు

చింతపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులనాయుడు విజయం సాధించడంతో ఉపాధ్యాయులు సంబరాలు జరుపుకున్నారు. సోమవారం గాదె విజయం సాధించినట్టు సమచారం అందడంతో ఉపాధ్యాయులు మండల కేంద్రంలో కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకున్నారు. ఈసందర్భంగా పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యూవీ గిరి మాట్లాడుతూ ఉపాధ్యాయులు స్వతంత్ర్య అభ్యర్థికి పట్టం కట్టడం సంతోషకరమన్నారు. గాదె శ్రీనివాసులనాయుడుకి ఉపాధ్యాయుల సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్నదన్నారు. శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గళమెత్తేందుకు గాదె సరైన నాయకుడని గుర్తించి ఉపాధ్యాయులు అతన్ని గెలిపించుకున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా ప్రధాన కార్యదర్శి కుడుముల వెంకటరమణ, పీఆర్‌టీయూ నాయకులు గిడ్డి వరలక్ష్మి, కొర్రు మత్స్యలింగం, రోలంగి రామలక్ష్మి, రొబ్బ వెంకట రమణమ్మ, కిట్లంగి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలి

▸▸ ఎస్‌ఐ వెంకటేశ్వరరావు

చింతపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి):మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని స్థానిక ఎస్‌ఐ వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసులు ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని లింగ సమానత్వం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో బీఎస్సీ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎస్.సాయి పవనజ్యోతి ప్రథమ స్థానం, బీఏ మొదటి సంవత్సరం విద్యార్థిని ఐ. భానుమతి ద్వితీయ స్థానం, కంప్యూటర్ సైన్స్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని తృతీయ స్థానం సొంతం చేసుకున్నారు. విద్యార్థినులకు ఎస్‌ఐలు వెంకటేశ్వరరావు, వెంకట రమణ మెడల్స్, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస పాత్రుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గిరిజనుడి మృతి

కొయ్యూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): డౌనూరు సమీప నిమ్మలపాలెం వద్ద సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ గిరిజనుడు మృతి చెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. చింతపల్లి మండలం గొంది పాకలు పంచాయతీ యానాం గ్రామానికి చెందిన పాంగి భాను చంద్ర(48) సోమవారం మధ్యాహ్నం స్వగ్రామం నుంచి తన భార్యతో కలిసి ద్విచక్ర వాహనంపై డౌనూరు మీ-సేవ కేంద్రానికి బయలుదేరాడు. నిమ్మలపాలెం వద్దకు వచ్చేసరికి వాహనం అదుపు తప్పడంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని భార్య జ్యోతి స్వల్పగాయాలతో బయటపడింది. అతనిని 108 వాహనంలో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరి విద్యార్థులపై పోలీసుల ఉదారత

▸▸ తాగునీటి, మౌలిక వసతులు కల్పన


నీటి ట్యాంకు వద్ద విద్యార్థులతో ఎస్‌ఐ షణ్ముఖరావు

జి.మాడుగుల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వసతిగృహంలో తాగునీటి సదుపాయంతో పాటు ఇతర మౌలిక వసతులు కల్పించి పోలీసులు ఉదారత చాటుకున్నారు. కళాశాల వసతిగృహాన్ని సందర్శనకు వెళ్లిన ఎస్‌ఐ షణ్ముఖరావుకు విద్యార్థులు తమ సమస్యలను విన్నవించుకున్నారు. కనీస తాగునీటి సదుపాయం, బట్టలు ఉతికేందుకు అవకాశం లేకపోవడం, బాత్‌రూమ్‌లో ప్లంబర్ సమస్యలను ఎస్‌ఐకు విన్నవించారు. విద్యార్థుల సమస్యలను ఎస్‌ఐ షణ్ముఖరావు నుర్మతి అవుట్‌పోస్ట్ సీఆర్‌పీఎఫ్ 198/బీఎన్ ఓసీ రాజాకేసి, కమెండెంట్ రాజేశ్ పాండేలకు వివరించారు. దీంతో వారు వసతి గృహంలో సమస్యలను పరిష్కరించారు.

ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన ఫ్లయింగ్ స్క్వాడ్

సీలేరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సీలేరు ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సోమవారం ఫ్లయింగ్ స్క్వాడ్ దుమంతి సత్యనారాయణ విస్తృతంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్ సెకండ్ ఇయర్ తెలుగు పరీక్షకు 49 మంది విద్యార్థులకుగాను 45 మంది హాజరయ్యారన్నారు. ఇక్కడ ఎటువంటి మాస్‌కాపీయింగ్ లేదన్నారు.

7న మండల సమావేశం

కొయ్యూరు, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఈనెల 7వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎస్‌కేవీ ప్రసాద్ తెలిపారు. ఎంపీపీ బడుగు రమేష్‌బాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించనున్న ఈ సమావేశానికి సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

టెన్త్ విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలి

గూడెంకొత్తవీధి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి అన్నారు. సోమవారం పెదవలస బాలుర ఆశ్రమ పాఠశాలలో టెన్త్ విద్యార్థులు రాస్తున్న గ్రాండ్ స్టేటస్ పరీక్షలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో అందరూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అప్పారావు, హెచ్‌డబ్ల్యూవో శ్రీనివాసు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గద్దెపై గాదె

... 5వ పేజీ తరువాయి

కేటాయించిన సిబ్బంది లెక్కించారు. మొత్తం 20,794 ఓట్లు పోల్ కాగా, 20,135 ఓట్లు చెల్లినవిగా, 659 ఓట్లు చెల్లనవిగా గుర్తించారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి తొలి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యింది. మొదటి ప్రాధాన్య ఓట్లలో గాదె శ్రీనివాసులునాయుడుకు 7,210, పాకలపాటి రఘువర్మకు 6,845, కోరెడ్ల విజయగౌరికి 5,804 రాగా, మిగిలిన ఏడుగురు అభ్యర్థులకు వందకంటే తక్కువ వచ్చాయి. విజేతను ప్రకటించాలంటే పోలైన ఓట్లలో 50 శాతం కంటే అదనంగా ఒక్క ఓటైనా రావాలి. అంటే చెల్లిన ఓట్లు 20,1345లో 10,067 ప్లస్ ఒకటి...10,068 ఓట్లను సాధించాలి. అయితే, మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేసరికి పోటీలో ఉన్న అభ్యర్థులెవరూ మ్యాజిక్ ఫిగర్ దక్కించుకోకపోవడంతో రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనివార్యమైంది.

రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపుతో విజయం..

మధ్యాహ్నం భోజన విరామం తరువాత రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపు ప్రక్రియను అధికారులు ప్రారంభించారు. మొదట తక్కువ ఓట్లు లభించిన అభ్యర్థుల రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను చేపట్టారు. రెండో ప్రాధాన్య ఓట్ల లెక్కింపులో రెండో రౌండ్‌లో పెదపెంకి శివ ప్రసాద్, మూడో రౌండ్‌లో ఎస్ఎస్ పద్మావతి, నాలుగు రౌండ్‌లో రాధాకృష్ణ, ఐదో రౌండ్‌లో సత్యనారాయణ, ఆరో రౌండ్‌లో శ్రీనివాసరావు, ఏడో రౌండ్‌లో దుర్గా ప్రసాద్, ఎనిమిదో రౌండ్‌లో సూర్యప్రకాష్‌ను ఎలిమినేట్ చేశారు. ఎనిమిది రౌండ్లు పూర్తయ్యేసరికి గాదె శ్రీనివాసులునాయుడుకు 7,248 ఓట్లు, పాకలపాటి రఘువర్మకు 6,881 ఓట్లు, కోరెడ్ల విజయగౌరికి 5,872 ఓట్లు లభించాయి. అప్పటికి కూడా ఎవరూ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోకపోవడంతో మూడో స్థానంలో నిలిచిన కోరెడ్ల విజయగౌరికి లభించిన ఓట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆమె ఎలిమినేషన్ తరువాత గాదె శ్రీనివాసులునాయుడు 9,237 ఓట్లు, వర్మకు 8,527 ఓట్లతో ఉన్నారు. ఈ క్రమంలో మ్యాజిక్ ఫిగర్ చేరుకోవడానికి మొదటి స్థానంలో నిలిచిన శ్రీనివాసులు నాయుడుకు 831 ఓట్లు అవసరమయ్యాయి. ఆ సమయంలో రఘువర్మ కౌంటింగ్ సెంటర్ నుంచి బయటకు వెళ్లిపోయారు. అనంతరం శ్రీనివాసులునాయుడు విజయానికి అవసరమైన 831 ఓట్ల కోసం రఘువర్మకు పోలైన ఓట్లను లెక్కించారు. ఈ క్రమంలో శ్రీనివాసులు నాయుడుకు 12,305 ఓట్లు వచ్చాయి. దాంతో శ్రీనివాసులునాయుడు విజయం సాధించినట్టు అధికారులు ప్రకటించారు.


ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మొదటి ప్రాధాన్య ఓట్లు ఎవరికెన్ని వచ్చాయంటే...

మొత్తం 20,794 ఓట్లు పోలవ్వగా 659 ఓట్లు చెల్లలేదు. మిగిలిన 20,135 ఓట్ల (మొదటి ప్రాధాన్య)లో కోరెడ్ల విజయగౌరికి 5,804, కోనూరు రాధాకృష్ణకు 30, గాదె శ్రీనివాసులనాయుడుకు 7210, దుర్గాప్రసాద్ పోతలకు 67, నూకల సూర్యప్రకాష్‌కు 85, ఎస్.ఎస్.పద్మావతికి 15, పాకలపాటి రఘువర్మకు 6845, పెదపెంకి ప్రసాదరావుకు 15, రాయల సత్యనారాయణకు 31, సుంకరి శ్రీనివాసరావుకు 33 ఓట్లు వచ్చాయి.

’గాదె’కు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేత

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన గాదె శ్రీనివాసులునాయుడుకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ సోమవారం రాత్రి 11 గంటలకు ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఓట్ల లెక్కింపు ముగిసిన అనంతరం వివరాలను ఎన్నికల కమిషన్‌కు పంపి, అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత అధికారికంగా ప్రకటించి ధ్రువీకరణ పత్రం అందజేశారు. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించిన అధికారులు, సిబ్బందికి కలెక్టర్ ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసులను అభినందించారు.

ఓటమి పాలైనా ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి: పాకలపాటి రఘువర్మ

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటమి పాలైనప్పటికీ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పాకలపాటి రఘువర్మ అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలు వెలువడడానికి కొద్ది నిమిషాలు ముందు కౌంటింగ్ కేంద్రం నుంచి బయటకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఓటమిని అంగీకరిస్తున్నానని, అయితే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి మాత్రం పోరాటం చేస్తానని స్పష్టంచేశారు. తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ రుణపడి ఉంటానని స్పష్టం చేశారు.

అభివృద్ధి దిశగా జిల్లా

... 5వ పేజీ తరువాయి

ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం భూమి కేటాయించింది. ఇంకా నక్కపల్లి ఎస్‌ఈజడ్‌లో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఇంకా మత్స్య, సముద్ర ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, పూడిమడక, నక్కపల్లి సముద్ర తీర ప్రాంతాల్లో జెట్టీల ఏర్పాటు పనులు వేగంగా జరుతున్నాయి. అనకాపల్లి మండలం కోడూరు ఏపీఐఐసీ పారిశ్రామిక ప్రాంతంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారు.

మౌలిక సదుపాయాల కల్పన

జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే మౌలిక వసతుల కల్పనలో వృద్ధి కనిపిస్తున్నది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల రహదారులతోపాటు జాతీయ రహదారులు అభివృద్ధి చెందాయి. అనకాపల్లి నుంచి పాయకరావుపేట మీదుగా రాజమహేంద్రవరం వరకు ప్రస్తుతం వున్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఆరు లేన్లకు విస్తరించడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గ్రామీణ ప్రాంత రోడ్ల నిర్మాణ పనులు వేగం పుంజుకున్నాయి. విద్యుత్, నీటి పారుదల రంగాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. మౌలిక సదుపాయాల కల్పనతోపాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇచ్చింది.

పెదగరువులో దాహం కేకలు

... 5వ పేజీ తరువాయి

పథకాన్ని కూడా ఏర్పాటు చేయలేదు. తాగునీటి సమస్య గురించి పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో 2019లో గ్రామస్థులంతా మూడు నెలల కష్టబడి శ్రమదానంతో బావి తవ్వుకున్నారు. దీనిపై పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి 15వ ఆర్థిక సంఘం నిధులతో బావికి విద్యుత్ మోటారు అమర్చి, నీటి సరఫరాకు పైపులు వేశారు. అయితే కొద్ది కాలానికే గొట్టాలు తుప్పుపట్టి పాడైపోయాయి. జీఐ పైపుల స్థానంలో పీవీసీ పైపులు వేయాలని అధికారులను కోరారు. కానీ ఎన్నాళ్లయినా పట్టించుకోలేదు. అప్పటి నుంచి తాగునీటి కోసం గెడ్డపై ఆధారపడుతున్నారు. వర్షాకాలంలో కలుషిత నీటి వల్ల వ్యాధులబారిన పడుతున్నామని, వేసవిలో చలమలు తీసుకుని నీటిని తెచ్చుకోవాల్సి వస్తున్నదని వాపోతున్నారు. అధికారులు, కూటమి ప్రభుత్వ నేతలు స్పందించి తాగునీటి సమస్య తీర్చాలని గిరిజనులు కోరుతున్నారు.

ప్రభుత్వ భూముల్లో దర్జాగా రోడ్ల నిర్మాణం

... 5వ పేజీ తరువాయి

చేసుకుంటామని ఇటీవల సాగునీటి సంఘం ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు. రైతుల ప్రయోజనం కోసమే అన్న ఉద్దేశంతో ఇరిగేషన్ అధికారులు అంగీకరించారు. అయితే అనుమతులు తీసుకున్న ఆ వ్యక్తులు.. శేషుగెడ్డలో గ్రావెల్ తవ్వి సుమారు కిలోమీటరు మేర రోడ్డుకు వినియోగించారు. అంతేకాక మట్టి రోడ్డుపై మెటల్ రోడ్డు వేస్తున్నారు. ఇదే సమయంలో శేషుగెడ్డకు ఎగువున అటవీ భూముల్లో ఎప్పటి నుంచో వున్న కాలిబాటను, వాహనాలు వెళ్లేలా చదును చేశారు. ఈ మార్గం కోటవురట్ల మండలం పందూరు వద్దకు చేరుతుంది. ఈ ప్రాంతంలో కొంతమంది బడాబాబులకు ఫామ్ హౌస్‌లు వున్నాయని, వారే అక్రమంగా రోడ్లు వేయిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇటు ఇరిగేషన్ శాఖ, అటు అటవీ శాఖ భూముల్లో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టడం వెనుక వీరి హస్తం వుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాగా అటవీ భూముల్లో నడక దారిని, వాహనాలు వెళ్లేలా చదును చేసిన విషయం తెలుసుకున్న ఎలమంచిలి అటవీ అధికారి అనిల్‌కుమార్, సెక్షన్ అధికారి వెంకటరమణ సోమవారం సిబ్బందితో అక్కడకు వెళ్లి పరిశీలించారు. కాలి బాటను చదునుచేయించిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని వెంకటరమణ తెలిపారు. కాగా పెద్దపల్లి నుంచి శేషుగెడ్డకు వెళ్లే మార్గంలో అక్రమంగా మెటల్ రోడ్డు వేయడంపై నీటిపారుదల శాఖ ఏఈ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. స్థానిక నీటి సంఘం ప్రతినిధి ఒకరు.. పాడైన రిజర్వాయర్ రోడ్డును అభివృద్ధి చేసుకోవడానికి మట్టి పనులు చేపడతామని చెప్పారని, ఈ రోజు వెళ్లి పరిశీలిస్తే.. నల్ల పిక్కతో (మెటల్) రోడ్డు నిర్మిస్తున్నారని, వెంటనే పనులు నిలుపుదల చేయించామని చెప్పారు. దీనిపై మరింత లోతుగా విచారించి, బాధ్యులపై చర్యలు చేపడతామని ఆయన తెలిపారు.

గిరిజనుల వినూత్న నిరసనపై స్పందించిన ఎస్టీ కమిషన్ ఛైర్మన్

అనంతగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ వాణిజ నుంచి చినకోనెల, బూరుగు గ్రామాలకు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభం కాలేదని ఆదివారం బూరుగు, చినకోనెల గ్రామాల గిరిజనులు అడ్డాకుల టోపీలతో నిరసన తెలిపిన విషయం తెలిసిందే. దీనిపై పత్రికల్లో వచ్చిన కథనాలకు ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ శంకరరావు స్పందించారు. అనుమతులు ఇవ్వకపోవడానికి గల కారణాలపై నివేదిక ఇవ్వాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారిని సోమవారం ఆయన సూచించారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆయా గ్రామాల గిరిజనులు ఎలా అభివృద్ధి చెందుతున్నారని ప్రశ్నించారు. వెంటనే అనుమతులు ఇవ్వాలని ఆదేశించారు.

విద్యార్థినులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

అనంతగిరి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జీనబాడు గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలోని 59 మంది పదో తరగతి విద్యార్థినులకు వైఎస్ఆర్‌టీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ తెడబారికి సురేశ్ ఆధ్వర్యంలోని అట్టలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మల్లీశ్వరి మాట్లాడుతూ విద్యార్థినులు పరీక్షల్లో ఎటువంటి ఒత్తిడికి గురికావొద్దని చెప్పారు. ప్రశాంతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అలాగే విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించాలని సురేశ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు సంధ్య, రమేశ్, బుజ్జి, వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లద్దాలు పంపిణీ


కళ్లద్దాలు చూపిస్తున్న విద్యార్థినులు

ముంచంగిపుట్టు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పలు పాఠశాలల్లో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి కళ్లద్దాలను అందించడం జరుగుతున్నదని కిలగాడ పీహెచ్‌సీ డాక్టర్ శిరీష అన్నారు. కిలగాడ కేజీబీవీ, స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల(2), బాలుర పాఠశాల(1) తదితర పాఠశాలల్లో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న సుమారు 112 మంది విద్యార్థులను గుర్తించి వారికి సోమవారం ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కిశోర్‌కుమార్ చేతుల మీదుగా సోమవారం కళ్లద్దాలను పంపిణీ చేయడం జరిగిందని డాక్టర్ చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కంటి చూపు సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, చూపు సమస్య తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.అలాగే ఉచితంగా అందిస్తున్న కళ్లద్దాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు ఎంవీవీ.ప్రకాశ్, మాణిక్యాలరావు, లక్ష్మీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నిందితులు, గంజాయి బస్తాలతో డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

22 కిలోల గంజాయి పట్టివేత

▸ ఇద్దరు పాత నేరస్థుల అరెస్టు : డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో 22 కిలోల గంజాయితో ఇద్దర్ని అరెస్టు చేసినట్టుడీఎస్పీ శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందస్తు సమాచారంతో పట్టణంలో వాహన తనిఖీలను చేపడుతుండగా, పాత నేరస్థులు రౌతు మల్లేశ్, గెడ్డం రామ్‌నవీన్ 22 కిలోల గంజాయితో ద్విచక్ర వాహనంపై వస్తూ పట్టుబడ్డారన్నారు. అలాగే స్కూటర్ డిక్కీలో ఉన్న మూడు కత్తులు, 138 గ్రాముల బంగారం, రూ.45 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి మొత్తం విలువ రూ.15 లక్షలు ఉంటుందని డీఎస్పీ చెప్పారు. నిందితులపై గతంలో పలు కేసులు నమోదయ్యాయన్నారు. వీరిద్దరినీ పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన సీఐలు, ఎస్ఐలను అభినందించారు. వారికి త్వరలోనే రివార్డులు కూడా అందిస్తామని డీఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీ చైతన్య, పట్టణ, రూరల్ సీఐలు గోవిందరావు, రేవతమ్మ, ఎస్ఐలు పాల్గొన్నారు.

క్రీడాకారుడికి ట్రైనీ డీఎస్పీ అభినందన


శ్రీనివాసరావును అభినంధిస్తున్న ట్రైనీ డీఎస్పీ చైతన్య, సీఐలు, ఎస్ఐ

నర్సీపట్నం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాస రావును సోమవారం ట్రైనీ డీఎస్పీ చైతన్య అభినందించారు. నర్సీపట్నం రూరల్ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు ఈ నెల 1, 2 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించారు. బెంచి ప్రెస్‌లో 95 కిలోలు, రెడ్ లిఫ్టింగ్‌లో 110 కిలోలు విభాగాల్లో ఆయన విజేతగా నిలిచారు. రెండు విభాగాల్లోనూ మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాలు సాధించిన శ్రీనివాసరావుతో పాటు ఫై డ్రీమ్ ఫిట్నెస్ జిమ్ కోచ్ డి.లోవరాజులను ట్రైనీ డీఎస్పీ చైతన్య, రూరల్ సీఐ రేవతమ్మ, పట్టణ సీఐ గోవిందరావు అభినందించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి


సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్

నర్సీపట్నం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి షియాజ్ ఖాన్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, మంచి స్పర్శ, చెడు స్పర్శలపై, ఈవ్ టీజింగ్, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, ఎంఈవో తలుపులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

12 మందిపై బైండోవర్ కేసులు


బైండోవర్ కేసులో నమోదు చేసిన వారితో మాట్లాడుతున్న తహసీల్దార్

గొలుగొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీహెచ్.నాగాపురం గ్రామ పంచాయతీ శివారు పల్లాపూరు గ్రామంలో జరిగిన స్థల వివాదంలో 12 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తహసీల్దార్ శ్రీనివాస రావు సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇరు వర్గాల వివాదాస్పద స్థలంలో ఎటువంటి తగాదాలకు పోకూడదని వివరించారు. అలాగే స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదని, తగాదాలకు వెళ్తే కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

చందకవీధిలో లోవోల్టేజీ సమస్యపై ఆందోళన


విద్యుత్ లోవోల్టేజీ సమస్యపై నినాదాలు చేస్తున్న ప్రజలు

చోడవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక చందకవీధిలో విద్యుత్ లోవోల్టేజీ సమస్యపై సోమవారం రాత్రి సీపీఐ నేత రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రజలు ఆందోళనకు దిగారు. విద్యుత్ లోవోల్టేజీ సమస్యల కారణంగా చదువుకునే విద్యార్థులతో పాటు స్థానికులు ఇబ్బందులు పడుతున్నామని, ఈ సమస్యపై విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోతున్నదని వారు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టని పక్షంలో ఈపీడీసీఎల్ కార్యాలయం ముట్టడిస్తామని రెడ్డిపల్లి అప్పలరాజు హెచ్చరించారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	455
విజయనగరం	459
శ్రీకాకుళం	459

చింతపండు అధరహో..

మాడుగుల వారపు సంతలో భలే గిరాకీ

30 కిలోల కావిడ రూ.2500కి విక్రయం

గత వారం కంటే లాభసాటిగా ధర

గిట్టుబాబు కావడంతో గిరి రైతుల హర్షం



వారపు సంతలో విక్రయానికి గిరిజనులు తెచ్చిన చింతపండు

మాడుగుల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మాడుగుల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో చింతపండుకు మంచి గిరాకీ లభించింది. 30 కిలోల కావిడకు రూ.2,500 ధర పలికింది. గత వారం కంటే దాదాపు అదనంగా ధర లభించడంతో గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

మాడుగుల వారపు సంతకు పాడేరు ఏజెన్సీలోని పలు గ్రామాల నుంచి గిరిజన రైతులు సోమవారం భారీగా చింతపండును తీసుకువచ్చారు. వంట్లమామిడి, పులుసు మామిడి, కందులపాలెం, కక్కి, ఈదులపాలెం, సలుగు దేవాపురం, వంట్లమామిడి, వంబటి గ్రామాలతో పాటు మాడుగుల మండలంలోని కృష్ణంపాలెం, శంకరం తదితర గిరిజన గ్రామాల నుంచి ఇక్కడ వారపు సంతలో విక్రయించేందుకు కావిళ్లతో చింతపండును తీసుకువచ్చారు.

సుమారు 30 కిలోల బరువు గల కావిడి చింతపండు సంత ప్రారంభంలో దాదాపు రూ.2,500 వరకు అమ్ముడుపోయింది. అనంతరం రూ.2 వేలకు ధర దిగింది. అదే విధంగా కావిడి చింతపండు బొట్ట ధర రూ.1300 నుంచి రూ.1500 మధ్యలో విక్రయించారు. గతవారం కంటే ఈ వారం చింతపండు ధర లాభ సాటిగా ఉందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా కొనుగోలుదారుల నుంచి ఆశీల పాట దారులు పంచాయతీ నిబంధనలను ఉల్లంఘించి భారీ మొత్తంలో నగదు వసూలు చేస్తున్నారని వ్యాపారులు వాపోతున్నారు. పంచాయతీ నిబంధలకు విరుద్ధంగా ఆశీలు వసూలు చేయడమేమిటని ప్రశ్నిస్తే, తిరిగి తమ మీదనే తిరగబడుతున్నారని అనకాపల్లి, నర్సీపట్నం, కొత్తకోట, గాజువాక వంటి ప్రాంతాల నుంచి వచ్చిన రైతులు వాపోయారు. దీనిపై పంచాయతీ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు

▸ కార్మిక శాఖ స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరావు


ఏఎల్‌పురంలోని ఓ దుకాణంలో బాల కార్మికులను గుర్తించిన అధికారులు

కృష్ణాదేవిపేట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): బాలలతో పనులు చేయిస్తే కఠిన చర్యలు తప్పవని అనకాపల్లి కార్మిక శాఖ స్పెషల్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణరావు హెచ్చరించారు. గొలుగొండ మండలంలోని ఏఎల్‌పురం, చోద్యం, గొలుగొండ, చీడిగుమ్మల తదితర గ్రామాల్లో దుకాణాలు, ఇటుకల బట్టీల్లో సోమవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో పనిచేస్తున్న పలువురు చిన్నారులను గుర్తించి యాజమానులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 ఏళ్ల లోపు చిన్నారులను చదువుకు దూరం చేసి వెట్టిచాకిరీ చేయించడం నేరమన్నారు. బాల కార్మికుల నిర్మూలన చట్టం ప్రకారం వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తామని, పనులు చేయించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఎక్కడైనా బాల కార్మికులతో పనులు చేయిస్తే 100, 1092, 112 నంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం లేబర్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, జిల్లా బాలల పరిరక్షణ ప్రతినిధి డి.లోవరాజు, అంగన్‌వాడీ కార్యకర్త మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వాయిదాలకు హాజరుకాని గంజాయి నిందితుడి అరెస్టు

రోలుగుంట, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం గ్రామానికి చెందిన గంజాయి నిందితుడు మాకిరెడ్డి సతీశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాకిరెడ్డి సతీశ్‌పై గతంలో మూడు గంజాయి రవాణా కేసులు నమోదయ్యాయని, గత మూడేళ్ల నుంచి అతను కోర్టు వాయిదాలకు సరిగ్గా హాజరు కాలేదన్నారు. దీంతో ఇటీవల కోర్టు అతనిపై మూడు నాన్‌బెయిలబుల్ వారెంట్‌లు జారీ చేసినట్టు తెలిపారు. దీంతో జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు సీఐ కోటేశ్వరరావు రెండు బృందాలను ఏర్పాటు చేశారన్నారు. నిందితుడు సతీశ్ ఆచూకీ హైదరాబాద్‌లో ఉన్నట్టు సమాచారం రావడంతో రెండు బృందాలు గాలించి అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు పేర్కొన్నారు. దీంతో కోర్టు రిమాండ్ విధించిం దన్నారు.

వేణుగోపాలస్వామి విగ్రహ ప్రతిష్ఠ


పూజలు అందుకుంటున్న వేణుగోపాలస్వామి

కె.కోటపాడు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సింగన్నదొరపాలెం గ్రామంలో వేణుగోపాలస్వామి ఆలయాన్ని సోమవారం ప్రారంభించారు. అలాగే స్వామి వారి విగ్రాహన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, మహిళలు తెల్లవారుజాము ఐదు గంటల నుంచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. తప్పెటగుళ్లు, చిడతలు తదితర కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బి.రామారావు, బాబూరావు, సబ్బి శ్రీను, బి.నరసింహమూర్తి, కె.సత్యనారాయణ, వై.ధర్మారావు, ఎస్.అప్పారావు, పి.అప్పారావు, కె.రాంబాబు, ఎర్రి నాయుడు, ఉరిటి బద్రి పాల్గొన్నారు.

ఘనంగా రామాలయ వార్షిక మహోత్సవం


కొమిర రామాలయంలో సామూహిక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రావికమతం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొమిర గ్రామంలో శ్రీసీతారాముల ఆలయ తొమ్మిదో వార్షిక తీర్థ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు ఆరెవెల్లి వెంకట రామ గోపాలాచార్యులు, పవన్ ఆధ్వర్యంలో 50 మంది దంపతులతో ప్రత్యేక పూజాది కార్యక్రమాలు చేశారు. అలాగే గ్రామంలో పెద్ద ఎత్తున విద్యుత్ దీపాలంకరణలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నేల వేషాలు నిర్వహించారు. భారీగా బాణసంచా కాల్చారు.

వన్యప్రాణులతో ప్రయోజనాలపై అవగాహన



బంగారుబందల గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆటవీ శాఖ అధికారులు

రావికమతం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల వల్ల కలిగే ప్రయోజనాలపై చోడవరం ఆటవీ శాఖ రేంజ్ అధికారి పీవీ.రవివర్మ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చీమపాడు పంచాయతీలోని బంగారుబందల గ్రామంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వన్య ప్రాణులను సంరక్షించుకుంటేనే గ్రామాలకు ప్రకృతి, రక్షణ లభిస్తాయన్నారు. వేసవిలో అడవులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. మైదానంలో అగ్ని ప్రమాదాలు సంభవిస్తే అగ్నిమాపక శకటాలతో సిబ్బంది వచ్చి అదుపు చేస్తారని, అదే అడవిలో సంభవిస్తే అదుపు చేయడం సాధ్యంకాదని చెప్పారు. అడవిలో అగ్ని ప్రమాదాలకు అవకాశం లేకుండా జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మేడివాడ సెక్షన్ ఫారెస్ట్ అధికారి శేఖర్ బాబు, ఆయా గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

తురువోలులో రెండు పూరిళ్లు దగ్ధం


ప్రమాదంలో కాలిపోతున్న పూరిల్లు

చీడికాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో తురువోలు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో చొక్కాకుల భగవంతుడు, కంచి రాములకు చెందిన పూరిల్లు దగ్ధమయ్యాయి. దీంతో వారు కట్టుబట్టలతో మిగిలారు. సమాచారం అందిన వెంటనే చోడవరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లి ఉంటుందని వీఆర్‌వో వై.సోమునాయుడు అంచనా వేశారు. కాగా, పూరిల్లులోనే టిఫిన్ సెంటర్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న చొక్కాకుల భగవంతుల దంపతులు ఈ ప్రమాదంతో ఉపాధి కోల్పోయారు. అలాగే దివ్యాంగుడైన కంచి రాముకు ప్రభుత్వం ఇచ్చిన మూడుచక్రాల బండి కాలిబూడిదైంది. ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

కిరండూల్ రైలు దంతెవాడ వరకే..

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేకే లైనులో ఆధునీకీకరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో విశాఖ, కిరండూల్ మధ్య నడుస్తున్న రైళ్ల సర్వీసులు ఈ నెల ఏడు నుంచి 16వ తేదీ వరకు విశాఖ-దంతెవాడ మధ్య రాకపోకలు సాగించేలా గమ్యాలను తాత్కాలికంగా కుదించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. దీంతో విశాఖ-కిరండూల్ పాసింజర్ (58501), విశాఖ-కిరండూల్ నైట్ ఎక్స్‌ప్రెస్ (18515) రైళ్లు ఈ నెల ఏడు నుంచి 15వ తేదీ వరకు విశాఖ నుంచి దంతెవాడ వరకు, తిరుగు ప్రయాణంలోని కిరండూల్-విశాఖ పాసింజర్ (58502), కిరండూల్-విశాఖ నైట్ ఎక్స్‌ప్రెస్ (18516) రైళ్లు ఈ నెల ఎనిమిది నుంచి 16వ తేదీ వరకు దంతెవాడ నుంచి విశాఖకు నడుస్తాయని పేర్కొన్నారు. దంతెవాడ, కిరండూల్ మధ్య రాకపోకలను తాత్కాలింగా రద్దు చేశామన్నారు.

రోడ్డు నిర్మించాలని గిరిజనుల వినూత్న నిరసన


వీరబద్రపేట రోడ్డు వేయాలని నిరసన తెలుపుతున్న గిరిజనులు

దేవరాపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి పంచాయతీ శివారు వీరభద్రపేటకు రహదారి నిర్మించాలని డిమాండ్ చేస్తూ సోమవారం గిరిజనులు వినూత్నంగా నిరసన తెలిపారు. వీరికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు సదుపాయం లేక గతంలో చిన్నారులు మృతి చెందారని, కనీసం కిలోమీటరు మేర ఉన్న రోడ్డుకు గ్రావెల్ వేసినా సౌకర్యంగా ఉండేదని చెప్పారు. గతంలో బురదలో కూర్చొని నిరసన తెలిపితే అధికారులు హడావడి చేసి చేతులు దులుపుకున్నారన్నారు. మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్నా మృత్యువాత పట్టడం తప్పడం లేదని వాపోయారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు శ్రీను, బచ్చల రమణ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర పెంచాలని ధర్నా


మద్దతు ధర పెంచాలని నినాదాలు చేస్తున్న రైతులు

మాడుగుల రూరల్: జీడి పిక్కలకు మద్దతు ధర పెంచి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు ధర్నా చేశారు. అవురువాడ పంచాయతీ కొండవీధి గ్రామంలో సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి మాట్లాడుతూ జీడి పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీల చేతిలో దోపిడీకి గురవుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా వాణిజ్య పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తున్నాయని, జీడి పంటకు మాత్రం ప్రకటించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జీడి పంటకు మద్దతు ధర కోసం అసెంబ్లీలో చర్చించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధి కె.భవాని, గిరిజన రైతులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కొవ్వొత్తుల ర్యాలీ

చోడవరం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా చోడవరం పంచాయతీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి సోమవారం ఈ ర్యాలీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఒ.మహేశ్, పంచాయతీ ఈవో బి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.

హక్కులపై సంపూర్ణ అవగాహన అవసరం

మాకవరపాలెం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): హక్కులపై మహిళలకు అవగాహన అవసరమని అంగన్‌వాడీ సంఘం మండల అధ్యక్షురాలు ధనమ్మ చెప్పారు. కొండల అగ్రహారం సోమవారం నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలు చదువుకునే సమయంలోనే హక్కుల గురించి తెలుసుకోవాలన్నారు. మహిళా శక్తిని, మానసిక స్థైర్యాన్ని, స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమలో విద్యార్థులు,అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ-2పై కళాజాత

నర్సీపట్నం అర్బన్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెదబొడ్డేపల్లిలో నవోదయం-2 కార్యక్రమంపై సోమవారం కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సీపట్నం ఎక్సైంజ్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ నాటుసారా, గంజాయి వినియోగం వల్ల జరిగే నష్టాలను వివరించారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

రావికమతం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా మద్యం బాటిల్ తరలిస్తున్న ఒక వ్యక్తిని అరెస్టు చేశామని ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. మండలంలో మేడివాడ వద్ద సోమవారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన పప్పల ఆదర్శ 48 మద్యం క్వాటర్ సీసాలు అక్రమంగా తరలిస్తు పట్టుపడ్డాడన్నారు. మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని, అతనిపై కేసు నమోదు చేశామని చెప్పారు.

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

చీడికాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలలు దాటిన ప్రతీ పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశు వైద్యాధికారి కేవీఎస్.రాఘవమ్మ సూచించారు. మండలంలోని పెదగోగాడ, శిరిజాం, బైలపూడి, జైతవరం గ్రామాల్లో సోమవారం పశువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీకాలు వేయడంలో అశ్రద్ధ చేస్తే గాలికుంటు వ్యాధి సోకి పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుండి సొంగ వస్తాయన్నారు. పాడి దిగుబడి కూడా తగ్గుతుందని చెప్పారు. అలాగే ఆడ పెయ్యిలకు బ్రూసిల్లోస్ వ్యాధి టీకాలు వేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

సారాతో అనేక అనర్థాలు

మాడుగుల రూరల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సారాతో అనేక అనర్థాలు ఎదురవుతాయని ఎక్సైజ్ అధికారులు చెప్పారు. మండలంలోని కొత్తవలస, గవరరం గ్రామాల్లో సోమవారం నవోదయం-2పై కళాజాత నిర్వహించారు. తద్వారా సారా వల్ల కలిగే అనర్థాలను గిరిజనులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ విశాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి, అనకాపల్లి డిస్టిక్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ సుధీర్, మాడుగుల ఎక్సైజ్ సీఐ సీహెచ్‌వివిఎస్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

డిల్లీ మహిళా సదస్సుకు ఈర్లె అనురాధ



దేవరాపల్లి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారితపై డిల్లీలో నిర్వహించే వర్క్ షాపునకు ఉమ్మడి విశాఖ జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్, కె.కోటపాడు జడ్పీటీసీ సభ్యురాలు ఈర్లె అనురాధకు ఆహ్వానం అందింది. జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 4, 5 తేదీల్లో ఈ వర్క్ షాపు నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా అనురాధ తెలిపారు. ఉమ్మడి విశాఖ నుంచి తనకు ఈ అవకాశం రావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు.